క్లుప్తంగా

నడకతో ఆరోగ్యం



విద్యారణ్యపురి: సైకిల్ తొక్కడం, వ్యాయామం, నడకతో ఆరోగ్యం లభిస్తుందని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఐడీ కార్డులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ 303 చైర్మన్ తడక కుమారస్వామి గౌడ్, చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, గవర్నర్ పశ్చిమట్ల ఎల్లగౌడ్, సైకిల్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పులివెంట్ల అనంత్‌కుమార్, బాధ్యులు రాపర్తి లక్ష్మయ్య, నర్సయ్య, వేణు, శేఖర్ గౌడ్, సునీల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మన్ రాపర్తి సురేష్, జయప్రసాద్, రాములు, లక్ష్మయ్య, రాజు, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన ముచ్చర్లకు చెందిన తెలుకుంట్ల లక్ష్మి అంత్యక్రియలకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి.. రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చిర్ర వీరస్వామి, శ్రీధర్, రాజేష్, బండా సాయిరెడ్డి, వెంకటేష్, శివ, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో ఓ వాహనదారుడికి గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో జరిగింది. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి వాహనదారుడు కిందపడిపోయాడు. దాంతో అతనికి గాయాలు కాగా స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టీపీటీఎఫ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఖిలా వరంగల్: తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ఖమ్మంలో టీపీటీఎఫ్ మహాసభ జరగనుంది. ఈమేరకు వరంగల్ పడమర కోటలో ఆదివారం జరిగిన సమావేశంలో మహాసభ వాల్‌పోస్టర్లను టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు, బొల్లంకొండ రమేష్, పూజారి మనోజ్, జె.స్వామి, బైరి స్వామి, సోమేశ్వర్‌రావు, అశోక్, పూర్ణచందర్, రమేష్, జహీర్, అశ్రఫ్, పరిపూర్ణచారి, భద్రయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఖిలా వరంగల్: అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ఏఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మస్క సుధీర్, సత్తుపల్లి భాస్కర్, మచ్చ రాము, మస్క సుమన్, అనిల్, మనోజ్ పాల్గొన్నారు.

మార్పునకు కృషి చేయాలి



ఎల్కతుర్తి : మహనీయుల స్ఫూర్తితో యువత మార్పుకోసం కృషి చేయాలని ముల్కనూర్ ఎస్సై సాయిబాబు అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం యూఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తోందని వివరించారు. అలాగే, న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి నాయక్, హరీష్, రాజు, సంపత్, సాంబరాజు, మహేష్, కిరణ్ పాల్గొన్నారు.

కంకరతో కష్టాలు

- ఎగసిపడుతున్న దుమ్ము
- అనారోగ్యం బారిన ప్రజలు
- పనులు ప్రారంభించి పదినెలలు!
- అర్ధంతరంగా రోడ్డు నిర్మాణ పనులు



అర్ధంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు



దుమ్ము లేస్తున్న రోడ్డు

హసన్‌పర్తి: నగరంలోని 55వ డివిజన్ భీమారంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కంకర, డస్ట్ పోసి వదిలేయడంతో దుమ్మూధూళితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి పదినెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక కారణాలతో నిలిచిన పనులు

భీమారం – చింతగట్టు వరకు రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.4కోట్లు విడుదలయ్యాయి. భీమారం సెంటర్‌లో సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తాయి. తొలి విడతగా చింతగట్టు నుంచి భీమారం బొడ్రాయి సమీపం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. పది నెలల క్రితం రెండవ విడత పనులను ప్రారంభించారు. భీమారం చర్చి నుంచి బొడ్రాయి పనులు కొనసాగించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర, డస్ట్ పోసి వదిలిపెట్టారు. దీంతో సమస్య మొదలైంది. వాహనాల రాకపోకల కారణంగా దుమ్మూ ధూళి వెదజల్లడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఎక్కువశాతం మంది ప్రజలు శ్వాసకోశ వ్యాధి బారినపడినట్లు వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రికి వెళ్లే వారిలో శ్వాసకోశ వ్యాధిగ్రస్తులే ఎక్కువని పేర్కొంటున్నారు. దాంతో ఆ ప్రాంతంలో అద్దెకు ఉంటున్న కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేసి వెళ్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కంకర రాళ్ల వల్ల వాహనాలు దెబ్బతినడమే కాకుండా బైక్‌లు అదుపు తప్పి పడిపోవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు (ఫైల్)

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..?

అసంపూర్తి రోడ్డు వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని సమస్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. గత ఆదివారం ఎమ్మెల్యేను ఆ పార్టీ నేతలు గద్దం శివరాం, ఆకుల కుమార్ కలిసి రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



కంకర రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అనారోగ్యం, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నాం. దుమ్ము కారణంగా అద్దె ఇళ్లు ఖాళీ చేసి వేరే చోటుకు పలువురు వెళ్లిపోతున్నారు.

– గౌసియా, భీమారం

పనులను త్వరగా పూర్తిచేయాలి



అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి. కంకర రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనాలు దెబ్బతింటున్నాయి. రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారుల వద్ద మొరపెట్టుకున్నా స్పందన లేదు.

– సంగాల రమేష్, భీమారం

పట్టుదలతో విజయం తథ్యం

నిట్ డైరెక్టర్ బిద్యాధర



వేడుకలో పాల్గొన్న అతిథులు

హసన్‌పర్తి : కృషి, పట్టుదల ఉంటే విజయం తథ్యమని నిట్ డైరెక్టర్ బిద్యాధర సుబుద్ధి అన్నారు. ఈ మేరకు ఏకశిల జూనియర్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన స్పార్కింగ్ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విద్యాధర సుబుద్ధి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయాన్ని వినియోగించుకునే వారే విజయం సాధిస్తారన్నారు. కాలంతో యుద్ధం, కష్టంతో సాహసం చేస్తే విజయం వరించునన్నారు. కమిషనర్, ఇన్‌కాంటాక్స్(ఏపీ, టీఎస్) జీవన్‌లాల్ లావుడియా, సమావేశానికి అధ్యక్షత వహించిన ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడారు. పోటీ పరీక్షల్లో ఏకశిల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. నిట్‌లో ఎంపికైన విద్యార్థులకు రూ.10వేలు నగదును ప్రకటించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ‘గోపా’ కార్యవర్గం



ఖిలా వరంగల్: రాష్ట్ర రోడ్డు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను వరంగల్ జిల్లా గోపా కమిటీ సభ్యులు కరీంనగర్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఖిలా వరంగల్ ఏకశిలా పార్కులో ఫిబ్రవరి 4న జరగనున్న గోపా వనభోజన కార్యక్రమానికి రావాలని మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో గౌడ గోపా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమారస్వామి, రామగోని సుధాకర్, కిరణ్‌కుమార్, మండ శ్యామ్, గొడిశాల సూరజ్, కన్న సాంబయ్య, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి రాక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సోమవారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అబ్దుల్ హై, తదితరులు

హన్మకొండ: విద్యార్థులు చదువుతో పాటు కళల్లోనూ రాణించాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్‌హై సూచించారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన కల్చరల్ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. అబ్దుల్‌హై ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఏదో ఒక కళలో ప్రావీణ్యం కలిగి ఉండాలని చెప్పారు. అలాగే, ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయాలని వివరించారు. పరిశోధలపై దృష్టి సారించాలన్నారు. కాగా, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టస్మా జిల్లా అధ్యక్షుడు మాదాల సతీష్ కుమార్, సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ కరస్పాండెంట్ ఎస్.నారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.హరిత, పి.మధు, ఎస్.అజయ్‌పాల్ రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



విద్యారణ్యపురి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావును హనుమకొండలో మున్నూరుకాపు సంఘం బాధ్యులు ఆదివారం సన్మానించారు. మున్నూరుకాపు మాసపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా వైద్యవిభాగంలో ఉత్తమ అవార్డును ప్రకటించారు. ఈమేరకు ఆయనకు సన్మానించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కటకం పెంటయ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బొరిగం నరసింగం, అలుగం ప్రభాకర్, మున్నూరు కాపు మాసపత్రిక వ్యవస్థాపకులు కోల జనార్దన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు వెలికితీయడానికే పోటీలు



స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ

కాజీపేట: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి స్పోర్ట్స్ మీట్‌లు ఎంతగానో దోహదపడుతాయని ట్రాఫిక్ సీఐ కె.సుజాత అన్నారు. కాజీపేట మండలం సోమిడి తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం రెండోరోజు వడుప్సా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాలల్లో నేడు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీలు పడుతూ ఆటలకు దూరమవుతుండడం బాధాకరమన్నారు. ఈ క్రీడా పోటీలను చూస్తుంటే తాను చిన్ననాడు ఆడుకున్న ఆటలు గుర్తుకొస్తున్నట్లు గుర్తుచేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్ మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే విద్యార్థులు జీవితంలో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో షణ్ముఖచారి, తాళ్ల మల్లేశం, రమణారెడ్డి, తక్కళ్లపల్లి బుచ్చిబాబు, శంకర్, వేణుమాధవ రావు, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్, మహేందర్ రెడ్డి

హన్మకొండ: హనుమకొండ కేయూసీ – పెద్దమ్మగడ్డ రోడ్డులోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ) –327 టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లను ఆదివారం పంపిణీ చేసి అన్నదానం చేశారు. మహేందర్ రెడ్డి కుమారుడు అరుణ్, కోడలు ప్రియాంక దంపతుల కుమారుడు అర్కా రెడ్డి పుట్టిన రోజును అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ ఈఈయూ –327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేయడంతో పాటు పండ్లు, దుప్పట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఈఈయూ –327 నాయకులు తులసి శ్రీమతి, మచ్చిక బుచ్చయ్య గౌడ్, దొనికెల సదయ్య, కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పరకాల : మాదారం గ్రామానికి చెందిన బొట్ల శ్రీలేఖ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబానికి మాదారం అభివృద్ధి కమిటీ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 50 కిలో బియ్యం అందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పసుల నాగరాజు, సీపీఐ నాయకులు దుప్పటి సాంబయ్య తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సంతోష్, సలహాదారుడు దుప్పటి సదయ్య, సదన్‌కుమార్, నాగరాజు, నాగేంద్ర, కుమార్, భద్రయ్య, రవి, కవిరాజ్, రాజేష్ పాల్గొన్నారు.

ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి



సంతోషిని సన్మానిస్తున్న కరాటే ప్రభాకర్

ఖిలా వరంగల్: అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో టర్కీ, రష్యాల్లో వేర్వేరుగా జరిగిన పోటీల్లో ఓరుగల్లు క్రీడాకారిణి గోల్డ్‌మెడల్ సాధించడం అభినందనీయమని కిక్ బాక్సింగ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ కొనియాడారు. వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో క్రీడాకారిణి ఎం.సంతోషిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఓరుగల్లు కీర్తి చాటడం హర్షనీయమన్నారు. మరోసారి ఫిబ్రవరి 7నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలల చాటాలని సూచించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, షేక్ రియాజ్, క్లెపు సతీష్‌చంద్ర, శ్రీమాన్‌రెడ్డి, చెల్పూరి రాహుల్, సిరిగిరి తిరుపతి, క్రీడాకారిణి తల్లిదండ్రులు మధు, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలను విజయవంతం చేయాలి



కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వరకు హనుమకొండలో జరగనున్న సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఈమేరకు సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులు, కార్మికుల వ్యతిరేక చట్టాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు వంతపాడుతోందని విమర్శించారు. రైతులు, కార్మికులు ఐక్యంగా ఉంటూ వాటిని ఎదుర్కొవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ల విడుదల

హసన్‌పర్తి: ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు హనుమకొండ ఫాతిమానగర్‌లోని బాలవికాసలో నిర్వహించనున్న సెంట్రల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ మహాసభల వాల్‌పోస్టర్లను హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి పుల్లా అశోక్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగాం శ్రీను, శ్రీవాణి, లలిత, రాజు, భిక్షపతి, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మినీ కల్చరల్ భవనం నిర్మించాలి



కాశిబుగ్గ జంక్షన్‌లో మాట్లాడుతున్న మేకల రవి

కాశిబుగ్గ: వరంగల్ పోచమ్మమైదాన్‌లో మినీ కల్చరల్ భవనం నిర్మించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కళాజాతా నాయకులు డిమాండ్ చేశారు. ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్ (ఐపీటీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సాగుతున్న కళాజాతా కాశిబుగ్గ జంక్షన్‌కు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం, సమన్యాయం, కళాకారుల సమస్యలపై, మూఢ విశ్వాసాలను వ్యతిరేకిస్తూ, శాంతి పర్యావరణ పరిరక్షణకు గత సెప్టెంబర్ 23న కళాజాతా ప్రారంభమైందని వివరించారు. కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజానాట్య మండలి నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏవీవీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాటి గురువులు

రామన్నపేట: వరంగల్ ఏవీవీ విద్యాసంస్థలో 1985–86లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 60మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, ఏవీవీ సంఘం కరస్పాండెంట్ చందా విజయ్‌కుమార్, లైఫ్ మెంబర్ చందా శ్రీకాంత్, రాజేశ్వర్, ఓంప్రకాశ్, కృష్ణ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో నేలకూలిన రైతుబజారు



రైతుబజారు ఎత్తివేయడంతో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు



కాజీపేట రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు (ఫైల్)

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు
- సమీక్ష సమావేశం నిర్వహించాలని రైతుల డిమాండ్

కాజీపేట: ఫాతిమానగర్ బ్రిడ్జి కింద రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రైతుబజారును అధికారులు తొలగించి బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టారు. ప్రజలకు నాణ్యతతో కూడిన కూరగాయలు అందించడంతో పాటు అన్నదాతలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రైతు బజార్లను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎంతో కాలంగా వివిధ కాలనీల ప్రజలకు కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులను చౌక ధరలకే లభించేలా ఏర్పాట్లు చేసింది.

ఐదున్నరేళ్లుగా ఎదురుచూపు

కాజీపేట రైతుబజారుపై ఆధారపడి ఎంతో మంది ఉపాధి పొందారు. ఐదున్నర ఏళ్లుగా రైల్వే లైన్‌పై రెండో సమాంతర బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు కావడంతో రైతుబజారు ఎత్తివేశారు. బ్రిడ్జి నత్తనడకన సాగుతుండంతో రైతుబజారు పునఃఏర్పాటు పనులు అటకెక్కాయి. ఫాతిమానగర్ వైపు పనులు చేపట్టాలనే ఉద్దేశంతో ఆర్అండ్‌బీ అధికారులు రైతుబజారును తొలగించారు. దీంతో దానిపైనే ఆధారపడి ఎంతో కాలంగా బతుకులు ఈడ్చిన వ్యాపారులు, ఉద్యోగస్తులు రోడ్డున పడ్డారు. రైతుబజారును కూల్చివేసిన అనంతరం సంబంధిత అధికారులు మరోచోట ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. బ్రిడ్జి, పచ్చని చెట్ల నీడల్లో అమ్మకాలు సాగించిన వ్యాపారులు నేడు రోడ్లపై పడి అమ్మకాలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పందించి రైతుబజారుపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అమ్మకందారులతో పాటు కొనుగోలుదారులు కోరుతున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కమలాపూర్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని, మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.